


# ఏయూ లుక్స్

తెలుగు వార పత్రిక

ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం ఆంధ్రప్రదేశ్

**ANDHRA UNIVERSITY**

Accredited by NAAC With 'A' Grade
ISO 2001:2015 Certified

aulooks@andhrauniversity.edu.in
aulooksvizag2019@gmail.com

ఫోన్ : 0891-2844000

OCTOBER 15 - 21, 2023

Chief Patron : Prof. P.V.G.D. Prasad Reddy | Chief Editor Prof. K.Samatha | Publisher : Prof. V.Krishna Mohan

సంపుటి : 2 | సంచిక : 88 | పేజీలు : 8


## డిఫెన్స్ స్టడీస్ సెంటర్ కోర్సుల నిర్వహణలో

# దేశంలోనే ఏయూ ప్రత్యేకం



దేశ రక్షణ కోసం నిత్యం పనిచేసే సైనికులు వారు. చిన్న వయసులో సైన్యంలోకి చేరారు. పదవీ విరమణ తరువాత నూతన ఉపాధి అవకాశాల కోసం వారు అన్వేషిస్తుంటారు. విద్యార్హతలు తక్కువగా ఉండటంతో వారికి ఉన్నత అవకాశాలు లభించడం లేదు. వీరి సమస్యలకు పరిష్కారం చూపుతూ భారతీయ త్రివిధ దళాల సైనికులకు ఉన్నత విద్యను చేరువ చేసే దిశగా ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆలోచన చేసింది. దేశంలోనే తొలిసారిగా సైనికోద్యోగులకు ఉన్నత విద్య అవకాశాలను, నైపుణ్యం పెంచే విధంగా అత్యదిక కోర్సులను అందించే దిశగా అడుగులు వేసింది. త్రివిధ దళాల ఉద్యోగులకు ఉన్నత విద్యను చేరువ చేస్తూ వారి ఆకాంక్షలను సాకారం చేసుకునే అవకాశాన్ని కల్పిస్తూ ఆంధ్రవిశ్వవిద్యాలయం నూతన చరిత్రను లిఖించింది.

వివరాలు 2,3,4 లో

- ఏయూ అందిస్తున్న కోర్సులతో దేశ ఆర్మీ, నేవి, ఎయిర్‌ఫోర్స్ సైనికులకు ఉన్నత ఉద్యోగ అవకాశాలు
- వర్శిటీలో పెద్దఎత్తున పీహెచ్‌డీలు చేస్తున్న సైనికాధికారులు
- ఏయూను సందర్శిస్తున్న త్రివిధ దళాల ఉన్నతాధికారులు
- వర్శిటీ అందిస్తున్న సేవలపై ప్రశంసల వెల్లువ
- దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న ఏయూ డిఫెన్స్ స్టడీస్ సెంటర్

## డిజిటల్ యుగంలో.. అంబేద్కర్ భావజాలం పుస్తకావిష్కరణ




**ఏయూ న్యూస్, అక్టోబర్** : ఏయూ రిజిస్ట్రార్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఛైర్ ప్రొఫెసర్ ఎం.జేమ్స్ స్టీఫెన్ రచించిన 'అంబేద్కర్ ఐడియాలజీ ఇన్ ద డిజిటల్ ఎరా' పుస్తకావిష్కరణ ఏయూ సెనేట్‌హాల్‌లో జరిగింది. ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకర్‌లు అతిథులుగా పాల్గొని ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆచార్య జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆలోచనలు, భావజాలం నేటి ఆధునిక యుగానికి అనుసంధానిస్తూ అవి నేటి సామాజిక సమస్యల పరిష్కారానికి ఎలా తోడ్పడుతాయో ఈ పుస్తకం ద్వారా వివరించడం జరిగిందన్నారు. ఈ పుస్తకాన్ని 20 చాప్టర్స్‌గా తీర్చిదిద్దినట్లు తెలిపారు. అంబేద్కర్ ప్రాధాన్యత, అంబేద్కర్ దృక్కోణంలో డిజిటల్ ఎరాలోని సామాజిక న్యాయం, సమానత్వం, అంబేద్కర్ విజన్, డిజిటల్ ఏక్టివిజం, సోషల్ మూమెంట్స్, సామాజిక మార్పుకు సోషల్ మీడియా దోహదం వంటి ఎన్నో అంశాలను ఈ పుస్తకంలో ఆవిష్కరించినట్లు తెలిపారు. ఈ పుస్తకంలోని 20 చాప్టర్స్‌ను మూక్స్ ఆన్‌లైన్ కోర్సుగా అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు. 2 క్రెడిట్ పాయింట్స్‌గా తీసుకొచ్చే ఆలోచన చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య ప్రసాదరెడ్డితో పాటు అతిథులు ఆచార్య జేమ్స్ స్టీఫెన్‌ను అభినందించారు ఈ కార్యక్రమంలో క్రిష్టియన్ మైనారిటీ కార్పొరేషన్ ఛైర్మన్ జాన్ వెస్లీ, ఏయూ పాలక మండలి పూర్వ సభ్యుడు యేసుపాదం, ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, పిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, డీన్స్ ఆచార్య వీర్రాజు, ఆచార్య బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆహార నాణ్యతలో

# రాజీ పడొద్దు



- హాస్టల్స్ ఉద్యోగులకు రిజిస్ట్రార్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్ సూచన
- ఇంజినీరింగ్ విద్యార్థుల వసతిగృహాల విస్తృత పరిశీలన
- రూమ్స్‌తో పాటు హాస్టల్ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలంటూ విద్యార్థులకు దిశానిర్దేశం

**ఏయూ న్యూస్, అక్టోబర్:** ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ విద్యార్థుల హాస్టల్స్‌ని రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థుల గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా విద్యార్థుల గదులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దుస్తులు, పుస్తకాలు నిర్ధేశించిన స్థానంలో పెట్టుకోవాలని సూచించారు. గదిలో ఏర్పాటు చేసిన అల్మారాలను వినియోగించాలని, గదులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు చెప్పారు. కొంత మంది విద్యార్థులు ఉదయం 9 గంటల తరువాత సైతం హాస్టల్‌లో కనిపించడంతో వారిని పిలచి మాట్లాడారు. తరగతులు ప్రారంభం అయ్యే సమయానికి కళాశాలకు చేరుకోవాలని, హాస్టల్స్‌లో ఉండే విద్యార్థులు దీనిని దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు, కొంత మంది విద్యార్థులు స్వల్ప అనారోగ్యంతో హాస్టల్‌లో ఉండటం గమనించి, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అవసరమైతే వైద్యశాలకు వెళ్లాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలసి మెస్‌లో ఆహార నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు నిత్యం అందించే ఆహారం మెనూ వివరాలు, నాణ్యత ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థులతో కలసి అక్కడే టిఫిన్ తిన్నారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత పెంపుపై విద్యార్థుల సూచనలను స్వీకరించారు. భోజన నాణ్యత పెంచాలని విద్యార్థులు కోరడంతో సంబంధిత సిబ్బందిని పిలచి మాట్లాడారు. వారం రోజులు చూస్తామని భోజన నాణ్యత పెంపుదల చేయాలని వారికి ఆదేశించారు. అదే విధంగా హాస్టల్‌లో టాయిలెట్స్ నిర్వహణ, పరిశుభ్రతకు తీసుకుంటున్న చర్యలను రిజిస్ట్రార్ స్వయంగా పరిశీలించారు. విద్యార్థులు భోజనం చేసే టేబుల్స్‌ను సిబ్బంది అక్కడే ఉంటూ వెంటనే శుభ్రం చేయాలని సూచించారు. ఇకపై తరచూ హాస్టల్స్‌ని తనిఖీ చేస్తామని, భోజన నాణ్యత, పరిశుభ్రతలో రాజీ లేకుండా పనిచేయాలని చెప్పారు. రిజిస్ట్రార్ వెంట ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణ రావు, ఆచార్య ఎల్.లక్ష్మీ నారాయణ, సిఎస్ఓ తదితరులు పాల్గొన్నారు.



## డిఫెన్స్ స్టడీస్ సెంటర్ కోర్సుల నిర్వహణలో..

# దేశంలోనే ఏయూ ప్రత్యేకం

- వేదుల నరసింహం

### 2017లో తొలి అడుగు పడింది..



ఆంధ్రవిశ్వవిద్యాలయం విభిన్న మానవ, మేధో వనరుల సమాహారంగా నిలుస్తోంది. ఎన్నో సామర్థ్యాలు కలిగిన ఏయూ భారత త్రివిధ దళాల ఉద్యోగులకు, మాజీ సైనికులకు అవసరమైన విద్య సంబంధ కోర్సులను అందించాలని సంకల్పించింది. దీనిని ఆచరణలో పెట్టే దిశగా 2017 ఫిబ్రవరి 14న ఏయూ ఇంజనీరింగ్ కళాశాల వేదికగా ఇండియన్ నేవీ, డైరెక్టర్ జనరల్ ఆఫ్ రీ సెటిల్‌మెంట్ ఉన్నతాధికారులతో సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో ఏయూలో అందుబాటులో ఉన్న కోర్సులు, ఏయూ సమర్ధతను వారికి కళ్లకుకట్టినట్లు చూపింది. ఏయూ సమర్ధతను ప్రత్యక్షంగా వీక్షించిన సైనిక అధికారులు వెంటనే ఏయూతో పలు ఒప్పందాలు చేసుకోవడానికి ఆసక్తి వ్యక్తం చేయడం జరిగింది.

### పదవీ విరమణ చేసే వారికి ప్రీ రిలీజ్ కోర్సులు..



పదవీ విరమణకు దగ్గరలో ఉన్నవారికోసం ప్రత్యేకంగా నూతన ఉపాధి అవకాశాలు కల్పించే ఆలోచన ఏయూ చేసింది. దీనిలో భాగంగా పలు ప్రి రిలీజ్ కోర్సులను ప్రారంభించింది. ఫైర్ సేఫ్టీ ఇంజనీరింగ్, మెరైన్ ఎలక్ట్రికల్ అండ్ నావిగేషన్ ఎలక్ట్రానిక్స్, మెరైన్ ఇంజనీరింగ్, యోగా ఇనస్ట్రక్టర్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, సైబర్ సెక్యూరిటీ వంటి కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఏడాదికి 15 బ్యాచ్‌ల వరకు ఈ కోర్సులను నిర్వహిస్తున్నారు. ఒక్కో కోర్సులో 30 నుంచి 50 మంది వరకు సైనికోద్యోగులు పాల్గొంటున్నారు. వీటికోసం ప్రత్యేకమైన సిలబస్‌ను తయారు చేసి ఏయూ అకడమిక్ సెనేట్‌లో పెట్టి ఆమోదించారు. విద్యార్థులకు శిక్షణ అనంతరం పరీక్షలు నిర్వహించి, మూల్యాంకనం చేసి గ్రేడ్ పాయింట్లతో కూడిన సర్టిఫికేట్‌ను అందిస్తున్నారు. ఇప్పటి వరకు 58 బ్యాచ్‌లను నిర్వహించిన 2900 మందికిపైగా సైనికోద్యుగులకు సర్టిఫికేట్‌లను ఏయూ అందించింది.

### జూనియర్ ఆఫీసర్స్‌కి పీజీ డిప్లమా..



హైదరాబాద్‌లోని దిండిగల్‌లో ఉన్న ఎయిర్‌ఫోర్స్ అకాడమిలోని జూనియర్ ఆఫీసర్ ట్రైనీగా పనిచేస్తున్న వారికి ఉపయుక్తంగా పి.జి డిప్లమాను డిజైన్ చేసి అందిస్తున్నారు. కొత్తగా విధుల్లో చేరిన ట్రైనీ ఆఫీసర్‌లకు ప్రత్యేక శిక్షణఉంటుంది. దీనిని పి.జి డిప్లమాకు అనుగుణంగా చేస్తూ మేనేజ్‌మెంట్‌లో పి.జి డిప్లమా సర్టిఫికేట్ అందించే విధంగా ఏయూ కృషిచేసింది.

### 26 డిప్లమా కోర్సుల నిర్వహణ...



ఇంటర్ విద్యార్హతో ఎయిర్ ఫోర్స్‌లో చేరేవారికి డిప్లమా కోర్సులను అందించే ప్రయత్నం ప్రారంభించింది. తొలుత ఒక డిప్లమా కోర్సుతో ప్రారంభమైన ఈ ప్రయాణం నేడు 26 డిప్లమాలను కెమానికల్, ఎలక్ట్రికల్, అకౌంటింగ్-మేనేజ్‌మెంట్, ఆఫీస్ మేనేజ్‌మెంట్, ఫిజికల్ ఫిట్‌నెస్ ట్రైనింగ్, సెక్యూరిటీ అండ్ ఇంటిలిజెన్స్ సర్వీస్, టీచింగ్ అండ్ ఎడ్యుకేషన్ సర్వీసెస్, హౌస్ కీపింగ్, మ్యూజిక్, ఎయిర్ ఫీల్ట్ సేఫ్టీ, అకౌంటింగ్ అండ్ ఆడిట్ మేనేజ్‌మెంట్, క్యాటరింగ్ మేనేజ్‌మెంట్, ఎయిర్‌సేఫ్టీ, మీటిరాజికల్ అసిస్టెన్స్ తదితర కోర్సులను అందిస్తున్నారు.

### సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్ స్థాపన....




భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా 2017 డిసెంబర్ 7న సెంటర్‌ఫర్ డిఫెన్స్ స్టడీస్‌ను లాంఛనంగా ప్రారంభించారు. సైనికోద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు ఉన్నత విద్య పరంగా అవసరమైన సేవలను విస్తృత స్థాయిలో అందించాలనే ఉన్నత ఆశయంతో దీనిని ఏర్పాటు చేసారు. ప్రస్తుతం దీనికి స్కూల్ ఆఫ్ డిఫెన్స్ స్టడీస్‌గా ప్రత్యేక కేంద్రంగా మార్పుచేసి సేవలను మరింత విస్తరిస్తున్నారు.

### పరిశోధనలో ప్రవేశాలు..



త్రివిధ దళాలలో పనిచేస్తున్న ఉన్నతాధికారులకు ఏయూలో పిహెచ్‌డి చేయడానికి ఆసక్తి వ్యక్తం చేశారు. ఉన్నత విద్యార్హతలు, సుదీర్ఘ వృత్తిపరమైన ప్రత్యక్ష అనుభవం కలిగిన వీరు ప్రవేవాలు పొందే విధంగా 2017 ఏప్రియల్ 5న ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఒక ఎంఓయూ చేసుకుంది. ఎగ్జిక్యూటివ్ కేటరిగీలో ఎయిర్‌ఫోర్స్ ఉన్నతాధికారులు పి.హెచ్‌డిలో ప్రవేశం పొందడం దీనితో సాధ్యపడింది. అపార జ్ఞానం కలిగిన రక్షణ రంగాల ఉన్నతాదికారులు ఏయూ విద్యార్థులకు స్ఫూర్తిని కలిగిస్తూ, పెద్ద జ్ఞాన వనరుగా నిలుస్తున్నారు.

### ఐఎన్ఎస్ విశ్వకర్మతో బీఎస్సీ డిగ్రీలు..



ఐఎన్ఎస్ విశ్వకర్మలో పనిచేస్తున్న సిబ్బందికి బిఎస్సీ హానర్స్ డిగ్రీలు అందించే దిశగా అవగాహన ఒప్పందం చేసుకున్నారు. దీనికి సంబంధించిన ఎంఓయూని 2017 డిసెంబర్ 1న చేసుకున్నారు. యూజీసీ నియమావళికి అనుగుణంగా వీరి సర్వీసు, అనుభవనం పరిగణలోనికి తీసుకుని వీరికి డిగ్రీలను ప్రధానం చేస్తారు.

### కాలేజ్ ఆఫ్ ఎయిర్ వార్‌ఫేర్‌తో అనుబంధం..




హైదరాబాద్‌లో ఉన్న కాలేజ్ ఆఫ్ ఎయిర్ వార్‌ఫేర్‌తో ఏయూ తన అనుబంధాన్ని ధృఢం చేసుకుంది. 2017 జూలై 3న చేసుకున్న అవగాహన ఒప్పందంలో భాగంగా ఎం.ఏ పొలిటికల్ సైన్స్ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్ కోర్సును ఏర్పాటు చేసింది. గ్రూప్ కెప్టెన్, వింగ్ కమాండర్ స్థాయిలో పనిచేస్తున్నవారికి ఈ ఎం.ఏ కోర్సును అందిస్తున్నారు. వీరు సెమిస్టర్ ట్రైనింగ్‌తో పాటు ప్రాజెక్ట్ వర్క్‌ని పూర్తిచేయాల్సి ఉంటుంది.

### బీ.టెక్‌లో లేటరల్ ఎంట్రీ....



ఇంజనీరింగ్ విద్యను మధ్యలో మానివేసిన ఎయిర్ ఫోర్స్ అధికారులకు ఉన్నత విద్య కలను నిజం చేసే విధంగా ఏయూ వారికి బిటెక్‌లో లేటరల్ ఎంట్రీ విభాగం కల్పించింది. దీనితో కొంత మందికి తమ విద్యార్హతలను పెంచుకునే అవకాశాన్ని ఏయూ కల్పించింది. అదే విధంగా ఇండియన నేవీ సైతం ఏయూతో అవగాహన ఒప్పందం చేసుకుని తమ సిబ్బందికి బిటెక్‌లో లేటరల్ ఎంట్రీ విధానంలో ప్రవేశాలు పొందడం జరిగింది.






# ఏయూతో కలసి నడుస్తున్న రక్షణ రంగ విభాగాలు..

◆ తూర్పు నావికాదళం ఏయూతో అవగాహన ఒప్పందం చేసుకుంది. సెయిలర్స్, నావికాదళ ఉద్యోగులకు విద్య సంబంధంగా సహకారం అందించే దిశగా ఈ ఒప్పందం జరిగింది. దీనిలో భాగంగా పిహెచ్‌డి ప్రవేశాలు సైతం కల్పించారు.

◆ ఏయూతో ఎయిర్ ఫోర్స్ ఎడ్యుకేషన్ అండ్ కల్చరల్ సొసైటీ అవగాహన ఒప్పందం చేసుకుంది. ఇంజనీరింగ్, లా, ఫార్మశీ కోర్సుల్లో సైనికోద్యోగులకు, సైనిక వీరులకు ప్రవేశాలను కల్పిస్తారు.

◆ నావికాదళ సిబ్బందికి ఎంటెక్‌లో ప్రవేశం కల్పించే విధంగా యూతో ఇండియన్ నేవీ ఎంఓయూ చేసకుంది.

◆ కేంద్రీయ సైనిక్ వెల్ఫేర్ బోర్డ్ సూచించిన విధంగా సైనికులకు ట్రేడ్ సర్టిఫికేట్లను ఏయూ అందిస్తోంది.

◆ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో శిక్షణ పొందిన సైనికోద్యోగులకు బి.పిఇడి కోర్సు సర్టిఫికేట్‌లు అదించే విధంగా ఏయూతో కేంద్రీయ సైనిక్ వెల్ఫేర్ బోర్డ్ అవగాహన ఒప్పందం చేసుకుంది





◆ ఏయూతో పి.డి డిప్లమా ఇన్ మేనేజ్‌మెంట్ అండ్ హెచ్‌ఆర్ మేనేజ్‌మెంట్ సర్టిఫికేట్లు అందించే విధంగా ఏయూతో ఎన్‌సిసి డైరెక్టరేట్ ఎంఓయూ చేసుకుంది

◆ ఇండియన్ కోస్ట్‌గార్డ్ సిబ్బందికి విద్య సహకారం అందించే విధంంగా ఏయూతో ఇండియన్ కోస్ట్‌గార్డ్ ఎంఓయూ చేసుకుంది

◆ డిజాస్టమ్ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ కల్పిస్తూ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అండ్ మిటిగేషన్ ఏర్పాటు చేసే దిశగా ఏయూతో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఎంఓయూ చేసుకుంది.

◆ దేశ రక్షణలో భాగంగా వీరమరణం పొందిన సైనికోద్యోగుల బార్యలకు ఉన్న విద్యను అందించే విధంగా ఏయూతో సైనిక్ వెల్ఫేర్ బోర్డ్ అవగాహన ఒప్పందం చేసుకుంది.








# విశిష్ట అతిధుల ఆగమనం..

త్రివిధ దళాలకు అధిపతి భారత రాష్ట్రపతితో సహా అనేకమంది అధికారులు ఏయూను సందర్శించారు.

◆ ఎయిర్‌చీఫ్ మార్షల్ బి.ఎస్ ధనోవా 2017లో ఏయూను సందర్శిచారు. ఏయూలో సంయుక్తంగా విద్య, పరిశోధన సంబంధ అంశాలపై కలపి పనిచేసే దిశగా ఆయన సుదీర్ఘంగా చర్చించి, ప్రణాళికలు అమలు జరిపారు.

◆ అరుణాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా సేవలందించిన బ్రిగేడియర్ డాక్టర్ బ.డి మిశ్రా, వైస్ అడ్మిరల్ కరం వీర్ సింఘ్‌లు 2019 జనవరి 7న ఏయూను సందర్శించి, విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు.

◆ ఇండియన్ నేవీ మెటీరియల్స్ డివిజన్ వైస్ అడ్మిరల్ పబ్బి ఏయూను సందర్శించారు. మెటీరియల్ సైన్స్, షిప్ బిల్డింగ్, ఎలక్ట్రిక్ షిప్‌లు తదితర అంశాలపై ఏయూ భాస్వామ్యంపై చర్చించారు


◆ 2017 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా వైస్ అడ్మిరల్ ఎస్.ఎస్ శర్మ విచ్చేసారు. 2018 జాతీయ సైన్స్ దినోత్సవానికి ముఖ్య అతిథిగా వైఎస్ అడ్మిరల్ ఎస్.ఆర్ శర్మ విచ్చేసారు.

◆ సెంట్రల్ ఆర్మీ కమాండ్(లక్నో) జనరల్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాజ సుబ్రమణియం ఏయూను సందర్శించారు.

◆ రీసెటిల్‌మెంట్ విభాగం డైరెక్టర్ జనరల్ మేజర్ జనరల్ శరద్ కపూర్ 2023 గణతంత్ర దినోత్సవానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏయూ నిర్వహిస్తున్న ప్రి రిలీజ్ కోర్సులను ఆయన ఎంతగానో ప్రశంసించారు.

◆ డిఆర్‌డిఓ చైర్మన్ డాక్టర్ సతీష్ రెడ్డి రెండు పర్యాయాలు స్వయంగా ఏయూను సందర్శించి, ఏయూతో సంయుక్త భాగస్వాయం చేసుకునే దిశగా చర్చించారు. ఏయూ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించి, విద్యార్థుల ఆవిష్కరణలు ఆయన ప్రత్యక్షంగా వీక్షించి, అభినందించారు.

◆ ఎన్‌సిసి డిప్యూటి డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమోడోర్ ఎన్.ఎన్ రెడ్డి, భారత రక్షణ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి డాక్టర్ పి.హరి ప్రకాష్‌లు పలుమార్లు ఏయూను సందర్శించారు.



## 6 వేల మందికి ఉన్నత విద్య ప్రదాయిని..



అంధ్రవిశ్వవిద్యాలయంతో 2018లో కేంద్రీయ సైనిక్ వెల్ఫేర్ బోర్డ్ అవగాహన ఒప్పందం చేసుకుంది. దీనిలో భాగంగా 15 సంవత్సరాలు సైనిక దళాలలో పనిచేసిన వారికి వారి వృత్తిపరమైన అనుభవాన్ని పరిగణలోనికి తీసుకుని బి.ఏ(హెచ్ఆర్ఎం) డిగ్రీలు అందించింది. ఇప్పటివరకు దాదాపు 6000 మంది సైనికులు ఈ ఎంఓయూ ఫలితంగా బి.ఏ డిగ్రీలను పొంది బ్యాంకులు తదితర రంగాలలో ఉన్నత ఉద్యోగులుగా స్థిరపడ్డారు.

## వీరసైనికుల కుటుంబాలకు ఫీజు రాయితీ..



దేశ రక్షణలో ప్రాణాలను అర్పించిన వీర సైనికుల కుటుంబాలకు ఏయూ బాసటగా నిలుస్తోంది. వీరమరణం పొందిన సైనికుల భార్య, పిల్లలు ఏయూలో ఉన్నత విద్యను అభ్యసిస్తే వారికి ఫీజు రాయితీ కల్పిస్తోంది. దేశంకోసం పనిచేసిన సైనికులను గుర్తిస్తూ వారి కుటుంబాలకు నేనున్నానంటూ వారి ప్రగతికి ఏయూ చిత్తశుద్ధితో పనిచేస్తోంది.

## అగ్ని వీరులకు ఏయూలో శిక్షణ..



ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రతిష్టాత్మకమైన మరొక కార్యక్రమంలో భాగస్వామిగా నిలవనుంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన అగ్నివీర్ కార్యక్రమంలో భాగంగా రక్షణ రంగాల్లో అడిగిడే వారికి అవసరమైన నైపుణ్య శిక్షణను ఏయూ అందిస్తుంది. ఐఎన్ఎస్ విశ్వకర్మతో చేసుకున్న అవగాహన ఒప్పందంలో భాగంగా అగ్నివీర్ లో ఉద్యోగాలు సాధించిన వారికి మూడు ట్రేడ్ విభాగాల్లో అవసరమైన శిక్షణను అందించదానికి ఏయూ సిద్ధమవుతోంది. ఇప్పటికే ఐఎన్ఎస్ విశ్వకర్మ దీనికి సంబంధించి ఏయును సహకారం అందించమని కోరింది. ఏయు సూత్రప్రాయంగా ఈ ప్రతిపాదనను ఆమోదించింది. త్వరలో ఈ కార్యక్రమం కార్యరూపం దాల్చనుంది.

## ఏయూకు రక్షణ రంగాల ప్రశంసల వెల్లువ..



ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని విభిన్న రక్షణ రంగ సంస్థల అధిపతులు ప్రశంసలతో ముంచెత్తారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ గ్రూప్ కెప్టెన్ ఎడ్యుకేషన్ రచనా జోషి, ఎన్‌సిసి డిప్యూటి డైరెక్టర్ జనరల్ వి. ఎం. రెడ్డి, ది ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా, ఐఎన్ఎస్ శాతవాహన, ఒడిస్సా రాజ్య సైనిక్ బోర్డ్, వెస్ట్ బెంగాల్ రాజ్య సైనిక్ బోర్డ్,భారత రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన కేంద్రీయ సైనిక్ బోర్డ్ కార్యదర్శి హెచ్.పి సింగ్ తదితరులు ఎందరో ఏయూ చేస్తున్న కృషిని అభినందిస్తూ ప్రశంసా పత్రాలను, అభినందన లేఖలను స్వయంగా పంపించారు. త్రివిధ దళాల సైనికులకు ఉన్నత విద్య, నైపుణ్య శిక్షణ కోర్సులను అందిస్తూ వారికి నూతన ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా చేస్తున్న కృషిని ప్రశంసించారు.

## విదేశీ సైనికులకు ప్రత్యేక కోర్సులు



భారతీయ త్రివిధ దళాల సైనికులతో పాటు విదేశాలకు చెందిన సైనికులకు సైతం ఉన్నత విద్యను అందించిన ఒక ప్రత్యేకమైన ఘనతను సొంతం చేసుకుంది శ్రీలంక వియత్నాం దేశాలకు చెందిన సైనికులకు పలు కోర్సుల్లో ప్రత్యేక శిక్షణ అందించి వారికి సర్టిఫికెట్లను సైతం ప్రదానం చేస్తుంది. ఇటువంటి ఘనతను సాధించిన తొలి విశ్వవిద్యాలయంగా ఏయు నిలుస్తోంది.

## విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తోంది..



ఆంధ్రవిశ్వవిద్యాలయంలో రక్షణ రంగాల ఉద్యోగులకు ఉపయుక్తంగా నిర్వహిస్తున్న స్కూల్ ఆఫ్ డిఫెన్స్ స్టడీస్ క్యాంపస్‌లో చదివే విద్యార్థులకు స్ఫూర్తిని కలిగిస్తోంది. తరచూ త్రివిధ దళాల ఉన్నతాధికారులు ఏయూను సందర్శించడం, విద్యార్థులనుద్దేశించి ప్రసంగించడం జరుగుతోంది. ఇది విద్యార్థుల్లో దేశ భక్తిని పెంచడంతో పాటు, రక్షణ రంగాల దిశగా నడవాలనే ఆలోచన కలిగిస్తున్నాయి. వైవిధ్యమైన, అత్యధిక కోర్సులను అందిస్తున్న వర్సిటీగా ఏయూ నిలుస్తోంది.

**– ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి, ఉపకులపతి**




## సమన్వయ వ్యవస్థగా ఏయూ నిలుస్తోంది..



విద్య అర్హతలను పెంచుకోవాలని అనేక మంది రక్షణ రంగాల ఉద్యోగులు ఆసక్తి చూపుతున్నారు. వీరికి మార్గం చూపుతూ ఏయూ పనిచేస్తోంది. విద్య సంబంధంగా వారికి నూతన కెరియర్‌ను ఎంపిక చేసుకోవడానికి, రక్షణ రంగాలలో పదవీ విరమణ తరువాత నూతన ఉన్నత ఉపాధి అవకాశాలను సులభంగా అందిపుచ్చుకోవడానికి మార్గం చూపడానికి ఏయూ అవకాశం కల్పిస్తోంది. సంయుక్త పరిశోధనలు నిర్వహించే దిశగా రక్షణ రంగాల శాఖలు ఆసక్తి వ్యక్తం చేస్తున్నాయి.

**ఆచార్య కె.నిరంజన్, డైరెక్టర్, సిడిఎస్**

# అధ్యాపకులపై గురుతర బాధ్యత




**ఏయూ న్యూస్, అక్టోబర్ :** పటిష్టమైన బోధన వ్యవస్థతో మెరుగైన సమాజం నిర్మాణం సాధ్యపడుతుందని ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు అన్నారు. ఇటీవల ఏయూ ఐఏఎస్ఈ ప్రాంగణంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలరం దూర విద్య బీఈడీ విద్యార్థుల శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు దేశ ప్రగతికి మార్గ దర్శకులుగా నిలుస్తున్నారన్నారు. జాతీయ నూతన విద్యా విధానం లక్ష్యాలను చేరుకునే దిశగా కృషి చేయాలని సూచించారు. ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ మాట్లాడుతూ భవిష్యత్‌తరాన్ని తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందన్నారు. శిక్షణ తరగతుల సమన్వయకర్త ఆచార్య టి.షారోన్‌రాజు మాట్లాడుతూ బీఈడీ చదివే ప్రతి విద్యార్థికి బోధన విధానాలు, చిన్నారుల మానసిక పరిణితి, సోషియాలజీ, ఫిలాసఫీ వంటి అంశాలను అవగాహన కల్పిస్తామన్నారు. ఆచార్య డి.నాగరాజ కుమారి మాట్లాడుతూ ఐదు రోజుల వర్క్‌షాపులో అందించే శిక్షణ కార్యక్రమాన్ని వివరించారు.

# పరిశుభ్ర క్యాంపస్‌గా ఏయూ




**ఏయూ న్యూస్, అక్టోబర్ :** పరిశుభ్ర క్యాంపస్‌గా ఏయూను తీర్చిదిద్దాలని, దీనిలో విద్యార్థుల భాగస్వామ్యం ఎంతో కీలకమని ఏయూ విద్య విభాగాధిపతి డాక్టర్ టి.షారోన్ రాజు అన్నారు. ఇటీవల ఏయూ విద్య విభాగంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపును స్వాగతిస్తూ స్వచ్ఛతాహిసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలోని పరిసరాలను విద్యార్థులు, ఆచార్యులు స్వయంగా శుభ్రం చేశారు. వ్యర్థాల రహితంగా దేశాన్ని తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, దీనిని ఏయూలో సైతం అమలు చేస్తున్నామన్నారు. వర్సిటీని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దడంలో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నాగరాజ కుమారి, విభాగ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సమస్యలకు సత్వర పరిష్కారం

**ఏయూ న్యూస్, అక్టోబర్ :** విద్యార్థుల సమస్యలకు సత్వర పరిష్కారం చూపే విధంగా యంత్రాంగం పనిచేస్తోందని ఏయూ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఎన్.విజయ్ మోహన్ అన్నారు. ఏయూ క్రీడా విభాగంలో విద్యార్థుల ఫిర్యాదుల స్వీకరణ కమిటీ సమావేశం నిర్వహించారు. వర్సిటీలో నూతన విద్య సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో కొత్తగా వర్సిటీలో చేరిన విద్యార్థుల నుంచి వచ్చే సమస్యలు, ఫిర్యాదులను సానుకూలంగా స్వీకరించి, పరిష్కరించాలని కమిటీ సభ్యులు నిర్ణయించారు. విభాగంతో పాటు హాస్టలలో ఇబ్బందులు ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద్ రెడ్డి విద్యార్థులకు అత్యంత ప్రాధాన్యమిస్తూ అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నారన్నారు. కమిటీ సభ్యులు నిరంతరం పర్యవేక్షిస్తూ విద్యార్థులకు సమస్యలు లేకుండా పనిచేయాలని చైర్మన్ ఆచార్య విజయ్ మోహన్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య పి. వెంకటేశ్వర్లు, ఆచార్య ఎ.కె.ఎం.పవార్, ఆచార్య కె.రమాసుధ, ఆచార్య టి.వి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యూఏసీ సమావేశ మందిరం ప్రారంభం



**ఏయూ న్యూస్, అక్టోబర్ :** ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంటర్నల్ క్వాలిటీ ఎష్యూరెన్స్ సెల్ (ఐక్యూఏసి)లో నూతన సమావేశ మందిరం(బోర్డ్ రూమ్)-శ్రేష్ట ని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి ప్రారంభించారు. ఆధునిక వసతులతో సమావేశాల నిర్వహణకు ఉపయుక్తంగా దీనిని ఏర్పాటు చేశారు. వివిధ సంస్థలు, ప్రతినిధులు తరచూ ఏయూ ఐక్యూఏసీ కార్యాలయాన్ని సందర్శిస్తుంటారు. వీరితో చర్చించడానికి ఉపయుక్తంగా ఆధునిక వసతులతో సమావేశమందిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా ప్రజెంటేషన్ ఇవ్వడానికి, వర్సిటీ వనరులు, వసతులు, సామర్థ్యాలు, ప్రగతి వంటి విభిన్న అంశాలను నిపుణులకు, కమిటీల ప్రతినిధులకు వివరించడానికి ఎంతో ఉపయుక్తంగా ఈ సమావేశ మందిరం నిలచే విధంగా ఆధునికత ఉట్టిపడే విధంగా దీనిని సుందరంగా తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, ఓఎస్‌డి ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్స్ ఆచార్య కె.శ్రీనివాసరావు, ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్, ఆచార్య టి.శోభశ్రీ, ఆచార్య ఎస్.కె భట్టి, వి.విజయలక్ష్మి, పాలక మండలి సభ్యురాలు ఆచార్య పి.సునీత, ఐక్యూఏసి కోఆర్డి నేటర్ ఆచార్య డి.లలిత భాస్కరి, ఆచార్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మూక్ కోర్సులు.. విద్యార్థులకు ఉపయుక్తం




**ఏయూ న్యూస్, అక్టోబర్ :** మేసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సులు (మూక్స్) విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తున్నాయని ఢిల్లీలోని ఎస్‌జిటిబి ఖాలా కళాశాల రసాయనశాస్త్ర ఆచార్యురాలు విమల్ రాహ్ అన్నారు. ఇటీవల ఆంధ్రవిశ్వవిద్యాలయం రసాయనశాస్త్ర విభాగాన్ని ఆమె సందర్శించి, విద్యార్థులను ఉద్దేశించి ప్రత్యేక ప్రసంగం అందించారు. అనంతరం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డితో మర్యాద పూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వర్సిటీలో అందిస్తున్న కోర్సులు, స్టార్టప్, ఇంక్యుబేషన్ తదితర అంశాలను వీసీ ఆమెకు వివరించారు. ఈ సందర్భంగా ఆచార్య విమల్ రాహ్ మాట్లాడుతూ ఈ-లెర్నింగ్ విద్యార్థులకు

## ఈ- లెర్నింగ్‌తో విద్యార్థులకు సులభతర బోధన

సులభతరంగా నిలుస్తోందన్నారు. విద్యార్థులు అభ్యశిస్తున్న కోర్సుతో పాటు విభిన్న శాస్త్ర అంశాలను నేర్చుకోవడానికి, నూతన జ్ఞానాన్ని పొందడానికి ఇవి ఉపయుక్తంగా నిలుస్తున్న విధానాన్ని వివరించారు. తాను స్వయంగా రూపకల్పన చేసి పలు మూక్ కోర్సులకు కంటెంట్, సిలబస్‌ని అందించిన విధానం వివరించారు. యూజీసీ నిర్వహించిన ఒక ప్రాజెక్టులో భాగంగా తాను ఈ- కంటెట్‌ని రూపకల్పన చేసి ఇచ్చిన విధానం తెలియజేశారు. దేశ వ్యాప్తంగా ఉన్న నిపుణులైన ఆచార్యుల సహకారం తీసుకుంటూ విభిన్న శాస్త్ర అంశాలలో ఈ- కంటెట్‌ని అభివృద్ధి చేసి విద్యార్థులకు ఉపయుక్తంగా నిలపాల్సిన అవసరం ఉందన్నారు. తరగతిగది బోధనకు పరిమితం కాకుండా పరోక్ష విధానంలో సైతం విద్యార్థులు నూతన జ్ఞానాన్ని పొందడానికి, శాస్త్రసంబంధంగా విస్తృత అవగాహన పెంచుకోవడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. ఈ దిశగా విశ్వవిద్యాలయాలకు వారికి అవసరమైన కంటెంట్‌ని అభివృద్ధి చేసి అందుబాటులో ఉంచాలన్నారు. ఉన్నత మానవ వనరులు, మౌళిక వసతులు కలిగిన ఏయూ ఈ దిశగా ముందడుగు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగాధిపతి ఆచార్య పి.శ్యామల, స్వయం నోడల్ అధికారిణి ఆచార్య కె.రమాసుధ, పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.

# అంబేడ్కర్ విధానాలతో పేదరిక నిర్మూలన సాధ్యం

**ఏయూ న్యూస్, అక్టోబర్ :** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంటేర్కర్ విధానాలతో పేదరిక నిర్మూలన సాధ్య పడుతుందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. ఇటీవల సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్ క్లూజన్ అండ్ ఇన్ క్లూజివ్ పాలసీలో అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవాన్ని పురష్కరించు కుని భారతదేశంలో పేదరికం-సమస్యలు, నిర్మూలన వ్యూహాలు అనే అంశంపై జాతీయ వెబీనార్ నిర్వహించారు. వర్చువల్ విధానంలో నిర్వహించిన ఈ సదస్సులో రిజిస్టార్ మాట్లాడుతూ పేదరికాన్ని అన్ని విధాలా నిర్మూలిం చాలన్న అంబేడ్కర్ సిద్ధాంతాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ ట్టిందని కొనియాడారు. కేంద్రం డైరెక్టర్ డాక్టర్ పి.సుబ్బారావు మాట్లాడుతూ పేదరికం అనేది కేవలం ఆర్థిక సమస్య కాదన్నారు. ఏయూ ఆంత్రో పాలజీ డిపార్ట్మెంట్ ఎమెరిటస్ ప్రొఫెసర్ వి.సు బ్రహ్మణ్యం మాట్లాడుతూ పేదరికం స్థాయిలు గ్రామీణ, గిరిజన, పట్టణ ప్రాంతాల వారీగా మారుతుంటా యన్నారు. ఏయూ రాజనీతి శాస్త్రం- పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్' విభాగం సీనోపి డాక్టర్ సురే మాన్ మాట్లాడుతూ ఆదాయ అసమానతలు, మురికివాడల్లో నివాసం ఉండడం పట్టణ పేదరికానికి ఉదాహరణ అన్నారు. ఉపాధి హామీ పథకం, ప్రధాన్ మంత్రి అవాస్ యోజన, నగదు బదిలీ కార్యక్రమాలు సమాచారం-విద్య, ఆరోగ్య సంరక్షణ, ఉద్యోగ కల్పన, నైపుణ్యాల అభివృద్ధి వంటి పథకాలు పేదరిక నిర్మూలనకు కీలకమన్నారు. ఈ సదస్సులో 150 మంది అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పుస్తకాన్ని ఆవిష్కరించిన వీసీ ప్రసాద రెడ్డి



**ఏయూ న్యూస్, అక్టోబర్ :** ఆంధ్రవిశ్వవిద్యాలయం సోషల్ వర్క్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.హరనాథ్, డాక్టర్ ఎం.అబ్రహాంలు రాసిన 'యూత్ పార్టిసిపేషన్ ఇన్ డిజాస్టర్ రిస్క్ మేనేజ్‌మెంట్ అండ్ క్లైమేట్ ఛేంజ్ ఎడాప్షన్' పుస్తకాన్ని ఏయూ వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి ఇటీవల తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎమ్.జేమ్స్ స్టీఫెన్ పాల్గొన్నారు. విపత్తు నిర్వహణపై విభిన్న నిపుణులు రచించిన 25 పరిశోధన పత్రాలను ఈ పుస్తకంలో ప్రచురించారు. విపత్తులు, పర్యావరణ మార్పులు, యువత భాగస్వామ్యం తదితర అంశాలను చర్చించారు. సమాజానికి అవసరమైన అంశంలో పుస్తకాన్ని తీసుకురావడం పట్ల సంపాదకులను వీసీ ప్రసాదరెడ్డి అభినందించారు.

# ఈ వారం డాక్టరేట్లు



## కామర్స్‌లో రామ మోహనరావు డాక్టరేట్




**ఏయూ న్యూస్, అక్టోబర్** : ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్థి పాలెపు రామమోహనరావుకు డాక్టరేట్ లభించింది. కామర్స్ అండ్ మేనేజ్మెంట్ విభాగం ద్వారా 'పెర్ఫార్మెన్స్ ఎవల్యూషన్ ఆఫ్ ద కో ఆపరేటివ్ బ్యాంక్స్ (ఏ కేస్ స్టడీ ఆఫ్ ద విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్. విశాఖపట్నం) 'అనే అంశం పై చేసిన పరిశోధనలకుగాను ఆంధ్ర విశ్వవిద్యాలయం ఈ డాక్టరేట్‌ను ప్రధానం చేసింది. డాక్టర్ కుడుముల వెంకట రమణమూర్తి పర్యవేక్షణలో ఆయని పరిశోధనలు జరిగాయి. ఇటీవల ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి చేతుల మీదగా రామమోహనరావు వీసీ కార్యాలయంలో ఈ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా వర్సిటీ ఉన్నతాధికారులు, పలువురు వర్సిటీ ఆచార్యులు, పరిశోధకులు రామ మోహనరావుకు అభినందనలు తెలియజేశారు.

## ఈసీఈలో శ్వేతకు డాక్టరేట్



**ఏయూ న్యూస్, అక్టోబర్** : ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్థి శ్వేత వెలిచేటికి డాక్టరేట్ లభించింది. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ద్వారా 'డిజైన్ అండ్ పెర్ఫార్మన్స్ అనాలసిస్ ఆఫ్ మినియార్టీలైజ్డ్ ప్లానర్ అండ్ కన్ఫార్మల్ లాంగ్ పిరియాడిక్ డిపోలే ఎర్రయ్ యాంటీన్నాస్ ఫర్ వైడ్ బ్యాండ్ అండ్ మల్టీబ్యాండ్ క్యారెక్టరిస్టిక్స్' అనే అంశం పై చేసిన పరిశోధనలకుగాను ఆంధ్ర విశ్వవిద్యాలయం ఈ డాక్టరేట్ ను ప్రధానం చేసింది. ఆచార్య మల్లికార్జునరావు, ఆచార్య అనురాధల పర్యవేక్షణలో ఆమె పరిశోధనలు జరిగాయి. ఇటీవల ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి చేతుల మీదగా శ్వేత వీసీ కార్యాలయంలో ఈ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా వర్సిటీ ఉన్నతాధికారులు, పలువురు వర్సిటీ ఆచార్యులు, పరిశోధకులు శ్వేతకు అభినందనలు తెలియజేశారు.

## కెమిస్ట్రీలో స్వర్ణలతకు డాక్టరేట్



**ఏయూ న్యూస్, అక్టోబర్** : ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్థి స్వర్ణలత నాగిరెడ్డికి డాక్టరేట్ లభించింది. కెమిస్ట్రీ విభాగం ద్వారా 'స్టడీస్ ఆన్ రిమూవల్ ఆఫ్ లడ్ అండ్ నికెల్ యూజింగ్ ఇమ్మొ బైలైజ్డ్ బయోమాస్ ఆఫ్ స్కెలిటోనిమా కోస్టా టామ్ అండ్ క్యాటోరియస్ గ్రాసెల్లస్ మైక్రో ఆల్గే అండ్ ఆప్టిమైజేషన్ యూజింగ్ సెంట్రల్ కాంపోజిట్ డిజైన్ 'అనే అంశం పై చేసిన పరిశోధనలకుగాను ఆంధ్ర విశ్వవిద్యాలయం ఈ డాక్టరేట్ ను ప్రధానం చేసింది. ఆచార్య ఎం. పద్మ పర్యవేక్షణలో ఆమె పరిశోధనలు జరిగాయి. ఇటీవల ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి చేతుల మీదగా స్వర్ణలత వీసీ కార్యాలయంలో ఈ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా వర్సిటీ ఉన్నతాధికారులు, పలువురు వర్సిటీ ఆచార్యులు, పరిశోధకులు స్వర్ణలతకు అభినందనలు తెలియజేశారు.

## ఏయూ తెలుగు విభాగంలో గుంటూరు శేషేంద్రశర్మ జయంతి వేడుకలు

### తెలుగు సాహిత్యాన్ని ప్రపంచమార్గం పట్టించిన ఇంద్రజాలికుడు శేషేంద్ర



**ఏయూ న్యూస్, అక్టోబర్ :** ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగం , సంగీత నృత్యశాఖ, సమైక్య భారతి విశాఖ రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరు శేషేంద్రశర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా గుంటూరు శేషేంద్రశర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభకు తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ప్రముఖ వైద్య నిపుణులు, విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ జి.రఘురామారావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గుంటూరు శేషేంద్ర శర్మ కవిత్వం ఇంద్రజాల యుతమైనదని, తెలుగు సాహిత్యాన్ని ప్రపంచ మార్గం పట్టించిన ఇంద్రజాలికుడు శేషేంద్ర అని అన్నారు. ఆయన కవిత్వం ప్రజలభాషలో రాయబడి విప్లవ చైతన్యపూరిత స్పృహను కల్గిస్తుందన్నారు. చీకటి గుహలలోనుండి వెలికివచ్చిన కాంతి పుంజంలాంటిదన్నారు. ఆయని కవిత్వంలో రసజ్ఞత పాటు సామాజిక దృకోణం కల్గించగల శక్తి ఉందని, పదునైన ఖడ్గాన్ని ఉపయోగించే వ్యక్తి నైపుణ్యం వలె శేషేంద్ర కవిత్వంలో సృజనశీలత ఉందన్నారు. అందుకే తెలుగు సాహిత్యం నుండి నోబుల్ బహుమతికి నామినేట్ అయిన నాదేశం – నాప్రజలు కావ్య వైశిష్ట్యాన్ని నేటి యువతతో పాటు ప్రతి సాహితీ కారుడు తెలుసుకోవాలన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన గీతం విశ్వవిద్యాలయ ఆంగ్ల విశ్రాంత ఆచార్యుడు ప్రయాగ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ శేషేంద్ర కవిత్వంలో అద్భుతమైన ప్రతీకలు తొణికిసలాడుతాయన్నారు. భాష పరిణామశీల మైందని దానిని గ్రహించి రచనల్లో పొందుపరిచిన సాహిత్యం సమాజాభివృద్ధికి తోడ్పడుతుందని లేకపోతే సాహిత్య మనుగడ ప్రశ్నార్థకమౌతుందనే విషయాన్ని శేషేంద్ర కవితల్లో పొందుపర్చారన్నారు. ఆత్మీయ అతిథిగా విచ్చేసిన ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ తెలుగు సాహితీ సంద్రాన్ని పరిపుష్టం చేసిన మహనీయుడు శేషేంద్రశర్మ అని కొనియాడారు. అనంతరం అతిథులను ఆచార్యులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు .

## నిర్ణయాధికారంలో అందరి భాగస్వామ్యం అవసరం



**ఏయూ న్యూస్, అక్టోబర్ :** విధానాల రూపకల్పన, నిర్ణయాలు తీసుకోవడంలో అందరి భాగస్వామ్యం తీసుకోవాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ఆచార్య రాజేంద్రప్రసాద్ అన్నారు. ఇటీవల ఏయూ రాజనీతి, ప్రభుత్వం పాలన శాస్త్ర విభాగంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విశాఖ ప్రాంతీయ శాఖ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వ్యవస్థలు మరింత జవాబుదారీగా మారాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రాంతీయ శాఖ చైర్మన్ ఆచార్య ఆర్.సుదదర్శనరావు మాట్లాడుతూ భారతదేశంలో పరిపాలన వ్యవస్థ నూతన విధానాలను అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. విభిన్న స్థాయిల్లో పరిపాలన సరళతరం చేస్తూ ప్రజలకు మరింత విస్తృత సేవలు అందించడం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐపీఏ పూర్వ అధ్యక్షుడు ఆచార్య ఇ.ఎ.నారాయణ, కార్యదర్శి పి.ప్రేమానందం, విభాగాధిపతి డాక్టర్ జి.వీర్రాజు, డాక్టర్ హరి, డాక్టర్ సవిత ఆర్.పగ్నిజ్, డాక్టర్ రాజశేఖర్, జగన్మోహనరెడ్డి పాల్గొన్నారు.

## ఆచార్యుల పరిశోధనకు బీఐఎస్ సహకారం

**ఏయూ న్యూస్, అక్టోబర్ :** ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ఇటీవల నిర్వహించిన ఒక రోజు సదస్సును వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. బీఐఎస్‌తో చేసుకున్న అవగాహన ఒప్పందంలో భాగంగా తొలి సదస్సును నిర్వహించినట్లు వీసీ తెలిపారు. బీఐఎస్ ఏయూలో ఛెయిర్ ప్రొఫెసర్ని ఏర్పాటు చేయాలని సూచించారు. తద్వారా విద్యార్థులకు మరింత ఎక్కువగా సేవలను అందిస్తూ. చేరువ చేయడం జరుగు తుందన్నారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణ రావు మాట్లాడుతూ వస్తువులు, ఉత్పత్తులను ప్రామాణీకరించడం తదితర అంశాలను వివరించారు. బీఐఎస్ టెక్స్టైల్ విభాగం సీనియర్ డైరెక్టర్ జె.కె. గుప్త మాట్లాడుతూ ఆచార్యులు చేసే పరిశోధనలకు సహకారం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఐఎస్ శాస్త్రవేత్తలు టి.సుజాత, మనోజ్ కుమార్ రాజక్, వైభవ్ జిం దాల్, శుభం యాదవ్, ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఆచార్య ఎసి.ఎన్.వి.సత్యనారాయణరెడ్డి, ఆర్జెంక్ట్స్ ప్రొఫెసర్ ఎస్. లక్ష్మీనారాయణ, విభాగ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.











## ఏయూ విద్యార్థినికి

# ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తింపు

### ప్రతిభచాటిన ఏయూ విద్యార్థిని మద్దిల సాయి సుప్రియ

### ప్రశంసించిన వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తదితరులు

వమ్మరి తిరుపతిరావు
ఏయూ జర్నలిజం విభాగ సీనియర్ విద్యార్థి

## రంగస్థలంపై ప్రేరణ పొందానిలా..

**మా** నాన్నమ్మ మద్దిల అంజలి దేవి రంగస్థల నటి. సంగీత, నృత్య కళాకారిని కావడంతో ఆమె ప్రభావం నాపై ఎక్కువగా పడింది. ఇదే నా రంగస్థల ప్రేరణకు నాంది. ఆ సమయంలో జేవీ సోమయాజులు గారి పరిచయం, ప్రోత్సాహంతో పదేళ్ల ప్రాయం నుంచే నృత్యంపై ఆసక్తితో నాట్యం నేర్చుకున్నాను. అనంతరం విజయనగరం మహారాజ సంగీత, నృత్య కళాశాలలో నృత్య విద్యకు బీజం పడింది. శ్రీమతి జగదీశ్వరి గారి పర్యవేక్షణలో "భక్త ప్రహ్లాద" అనే నృత్య రూపక నాటక ప్రదర్శన చేసి అందులో ఉన్న సూత్రధారి, గొల్లభామ, భటుడు, పహ్లాద, నృసింహ స్వామి అవతారం వంటి అద్భుతమైన పాత్రలు ధరించి అందరి మన్ననలను పొందడం ద్వారా నా రంగ స్థల ప్రయాణం ప్రారంభమైంది.

## ఏయూ పాత్ర వెలకట్టలేనిది



ఆంధ్ర విశ్వవిద్యాలయంలో విద్యను అభ్యసించడం నాకు ఎంతో ప్రత్యేకం. థియేటర్ ఆర్ట్స్ విభాగంలో ప్రస్తుతం నా విద్యాభ్యాసం కొనసాగుతోంది. ఇక్కడ అందిస్తున్న విలువలతో కూడిన విద్య వలన నేను అన్ని రంగాలలో స్వతంత్రంగా రానించగలుగుతున్నాను. నా విజయంలో ఏయూ పాత్ర, విభాగ ప్రోత్సాహం వెలకట్టలేనివి. థియేటర్ ఆర్ట్స్ విభాగ ఆచార్యులు నాలోని లోపాల్ని సవరించి ముఖకవళికలు, హావభావాలు పలికించడంలోను, స్టేజ్ మేనేజ్‌మెంట్, నటనతో పాటు వ్యాఖ్యాతగా, నృత్య కారిణిగా ప్రదర్శనలు ఇవ్వడంలోను ఎలాంటి మెలుకువలు పాటించాలి, ఏఏ అంశాలను ప్రధానంగా పరిగణలోనికి తీసుకోవాలి అనే విషయాలపై సంపూర్ణ అవగాహన కల్పించారు. వివిధ భంగిమలలో ఎలా ఉండాలో నేను పోషించిన వివిధ పాత్రలల్లో ఏ విధంగా ఒదిగిపోవాలో వంటి అంశాల్లో తర్ఫీదునిస్తూ సంపూర్ణ కళాకారిణిగా తీర్చిదిద్దారు. ఒక ఆర్టిస్ట్‌గా ఎదగాలంటే ఏయే అంశాలపై అధ్యయనం చేయాలో నేర్పించారు. ఇందుకు మా గురువర్యులు డాక్టర్ మరపల్ల బాస్కరరావు సార్‌కి, డాక్టర్ శశి భూషణరావు సార్‌కి ప్రత్యేక దన్యవాదాలు తెలియజేస్తున్నాను.

## కుటుంబ నేపథ్యం



మాది ఉమ్మడి విజయనగరం జిల్లా. మా నాన్న మద్దిల ప్రసాదరావు, అమ్మ మద్దిల వసంతకుమారి, నా ప్రాథమిక విద్యాభ్యాసం విజయనగరం, ఒడిశాలో జరిగింది. పదవ తరగతి జిల్లా పరిషత్ పాఠశాల శ్రీకాకుళంలో చదివాను. ఇంటర్మీడియట్ హెచ్‌ఈసీ మహారాజా మహిళ కళాశాలలో, అనంతరం డిగ్రీ మొదటి సంవత్సరం మహారాజా కళాశాల, రెండవ సంవత్సరం, తృతీయ సంవత్సరం డాక్టర్ వి.ఎస్. కృష్ణ కళాశాల మద్దిలపాలెం పూర్తి చేసాను. ఆంగ్ల సాహిత్యం, హిందీ సాహిత్యంలో ఆంధ్రా యూనివర్సిటీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశాను. ప్రస్తుతం ఏయూ థియేటర్ ఆర్ట్స్‌లో నటనలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లొమా కోర్సు చేస్తున్నాను. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఒడిషా భాషలలో ప్రావీణ్యతను బహుభాషా నైపుణ్యాన్ని సాధించాను. నాట్యంలోనే కాకుండా స్క్రిప్ట్ రైటింగ్, కాస్ట్యూమ్ డిజైనర్, మేకప్ ఆర్టిస్ట్, వ్యాఖ్యాతగా రాణిస్తున్నారు.

## లభించిన ప్రశంసలు

ఆంధ్ర విశ్వవిద్యాలయం రంగస్థల విభాగం ద్వారా నేను చేసిన వివిధ పాత్రలకుగాను నాకు " రంగస్థల సావిత్రి"గా గుర్తింపు లభించింది. అండమాన్‌లో పోర్ట్ బ్లెయిర్‌లో జరిగిన కార్యక్రమానికి చేసిన ప్రదర్శనకు గాను "నాట్య చూడామణి", శ్రీశైలం దేవస్థానంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా చేసిన ప్రదర్శనకు గాను "నాట్య మయూరి", సిలికాన్ ఆంధ్ర గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో "నృత్య రూపకాలకు గాను గురురత్న, కళారత్న, నాట్య శిఖామని వంటి బిరుదులు, సత్కారాలు లభించాయి. ఇటీవల కాలంలో నా ప్రతిభను గుర్తించి నాట్య కళాకారిణిగా చేస్తున్న సేవలకు గాను " ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తింపు లభించింది. కళారంగానికి నేను అందించిన సేవలు నేపథ్యంలో ఈ రికార్డ్స్ కోసం దరఖాస్తు చేయగా పలు అంశాల పరిశీలన అనంతరం ఈ వార్డు నాకు లభించడం జరిగింది. ఈ సందర్భంగా విభాగ ఆచార్యుల సమక్షంలో ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సార్‌ను కలవగా ఆయన అభినందనలు తెలియజేసిన సందర్భం నా కళారంగ ప్రస్థానంలో ఒక మధురజ్ఞాపకం.



## మధురవాణి పాత్రకు 'మహానటి' గా పట్టం

అంతర్జాతీయ తెలుగు మహాసభలలో "కన్యా శుల్కం" నాటకంలో ప్రముఖమైన మధుర వాణి పాత్రను పోషించినందుకు 'మహనటి' గా ప్రశంస లభించింది. నందమూరి లక్ష్మి పార్వతి మేడమ్ పాత్రలో ఒదిగి పోవడమే కాకుండా ఆ పాత్రకు వన్నె తెచ్చావని కొనియాడారు. ప్రముఖనాట్యాచార్యులు వెంపటిచిన సత్యం 92వ జయంతిని పురస్కరించుకొని హైదరాబాద్ నగరం లో శంషాబాద్‌లో శ్రీ రామ ఆశ్రమంలో 2వ ప్రపంచ కూచిపూడి నృత్యోత్సవ వేడుకలలో చేసిన ప్రదర్శనకు గాను త్రిదండి చిన్న జీయర్ స్వామి చేతులు మీదుగా తీసుకున్న పురస్కారం ఒక దైవ ప్రసాదంగా భావిస్తాను. హైదరాబాద్ నగరంలో లింగంపల్లి నవోదయ పాటశాలలో జరిగిన ఆజాదిక అమృత్ మహోత్సవాలలో బాగంగా 75 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సందర్భంగా 20 మంది విద్యార్థి ,విద్యార్థినులతో కలిసి "డెవలప్మెంట్ ఆఫ్ ఇండియా" అనే అంశంపై తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషలలో స్వతహాగా స్క్రిప్టు వర్క్, డైరెక్షన్, కాస్ట్యూమ్ డిజైనింగ్, మేకప్ ఆర్టిస్ట్, సాంకేతిక నిపుణుల సలహాలు, సూచనల తో అల్ రౌండర్ పాత్ర పోషించి అందరిని ఆకట్టుకునేలా ప్రదర్శన ఇవ్వడం మంచి అనుభూతినిచ్చింది.

# వైభవంగా దుర్గా పూజ నిర్వహణ



**ఏయూ న్యూస్, అక్టోబర్ :** ఆంధ్రవిశ్వవిద్యాలయం కంప్యూటర్ సెంటర్‌లో శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని దుర్గాపూజను ఘనంగా నిర్వహించారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. విశ్వవిద్యాలయం ఆచార్యులు, ఉద్యోగులు, విద్యార్థులు అన్ని రంగాల్లో విజయం సాధించాలని, విద్యార్థులకు ఉన్నత అవకాశాలు లభించాలని ఆకాంక్షిస్తూ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, కంప్యూటర్ సెంటర్ సంచాలకులు ఆచార్య భాస్కర రెడ్డి, దూరవిద్య కేంద్రం సంచాలకుడు ఆచార్య కె.విశ్వేస్వర రావు, డాక్టర్ హెచ్.పురుషోత్తం, కంప్యూటర్ సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సైకాలజీలో కాగ్నిటివ్ థెరఫీ సెంటర్ ప్రారంభం



**ఏయూ న్యూస్, అక్టోబర్ :** ఆంధ్రవిశ్వవిద్యాలయం సైకాలజీ విభాగంలో అధునాతన కాగ్నిటివ్ డిజిటల్ థెరఫీ సెంటర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి ప్రారంభించారు. ఇటీవల విభాగంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కాగ్నిటివ్ థెరఫి సెంటర్ ప్రారంభించిన అనంతరం పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. కేంద్రం ప్రత్యేకతలను, ప్రజలకు, విద్యార్థులకు ఉపయుక్తంగా నిలచే విధానాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రెస్ట్ రూమ్‌ని విద్యార్థినితో ప్రారంభింపజేశారు. అనంతరం విభాగ ప్రయోగశాలను తనిఖీ చేశారు. అవసరమైన మార్పులు చేయాలని సూచించారు. తరగతి గదులు, సమావేశ మందిరం, ప్రయోగశాలలు ఆధునీకరించిన విధానాన్ని గమనించి, పలు సూచనలు చేశారు. విభాగాధిపతి ఆచార్య ఎం.వి.ఆర్ రాజు మాట్లాడుతూ వ్యక్తిలోని మానసిక సమస్యను గుర్తించడం, డిప్రెషన్, ఒత్తిడి స్థాయిలు, ఏంగ్జయిటీ, ఎమోషన్స్ వంటివి కాగ్నిటివ్ డిజిటల్ థెరఫీ సహాయంతో పరిష్కరించవచ్చున్నారు. వీటితో పాటు విభాగంలో ఆల్కహాల్ ఎవర్షన్ థెరఫి, న్యూరో ఫిజిలాజికల్ లాబ్‌కు పనిచేస్తున్న విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాస రావుతో పాటు విభాగ ఆచార్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రిజిస్ట్రార్‌కు జూపూడి అభినందన



**ఏయూ న్యూస్, అక్టోబర్ :** రిజిస్ట్రార్‌గా నియమితులైన ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌ని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకర్ అభినందించారు. ఇటీవల ఆయని కార్యాలయానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. విద్యావంతుడిగా, లక్ష్యం సాధన కోసం నిరంతరం శ్రమించే జేమ్స్ స్టీఫెన్‌ను రిజిస్ట్రార్‌గా నియమించడం పట్ల వీసీకి కృతజ్ఞతలు తెలిపారు. ఇరువురి మార్గదర్శకత్వంలో ఏయూ అద్వితీయ ప్రగతి సాధించాలని కోరారు.



# క్రీడా ప్రతిభావంతులకు ఉపాధి అవకాశాలు

**ఏయూ న్యూస్, అక్టోబర్ :** క్రీడా ప్రతిభావంతులకు మంచి గుర్తింపుతో పాటు ఉన్నత ఉపాధి అవకాశాలుతో లభిస్తున్నాయని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. ఇటీవల ఏయూ జిమ్మాజియంలో తైక్వాండో పురుషులు, మహిళల ఇంటర్ యూనివర్శిటి క్రీడాపోటీలతో పాటు వర్సిటీ టీమ్స్ సెలక్షన్స్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఆంధ్రవిశ్వవిద్యాలయం చదువుతో పాటు క్రీడలకు కూడా అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు. వ్యాయామ విద్యా విభాగంలో నిర్వహించే ఎంపికలను యూనివర్శిటి విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. ఏయూ స్పోర్ట్స్ బోర్డ్ డైరెక్టర్ ఆచార్య ఎన్ విజయమోహన్ మాట్లాడుతూ రిజిస్ట్రార్ గా బాధ్యతలు స్వీకరించిన ఆచార్య జేమ్స్ సీఫెన్ మంచి విద్యావేత్త, పలు పేటెంట్లుకు గుర్తింపుతో పాటు మంచి వ్యక్తిత్వం కలిగిన వారని కొనియాడారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం క్రీడాలకు వైస్ ఛాన్సలర్ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. దీంతో గత ఏడాది 150 మందికి పైగా క్రీడాకారులు పతకాలు సాదించారన్నారు. అలాగే పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి. కృష్ణమోహన్ కు స్పోర్ట్స్ బోర్డు తరపున కృతజ్ఞతలు తెలియజేసారు. ఆయన కూడా క్రీడల నిర్వహణకు ఎంతో ప్రోత్సాహం కల్పించడం జరిగిందన్నారు.



ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆంధ్రవిశ్వఇద్యాలయం అనుబంధ కళాశాలల నుంచి 24 పురుషుల జట్లు, 26 మహిళల జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నఓట్లు వెల్లడించారు. ఏయూ వ్యాయామ విద్యా విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి మాట్లాడుతూ ఈ అకడమిక్ ఇయర్‌లో క్రీడా పోటీలతో పాటు యూనివర్శిటి జట్టు ఎంపికలు ప్రారంబించిన రిజిస్ట్రార్ ను సత్కరించి మెమోంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో విభాగ ఆచార్యుడు డాక్టర్ వాసుదేవరాజు, నర్సింహారావు, డాక్టర్ వి.ఎస్. కృష్ణాకళాశాల లెక్చరర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ సంధ్యారాణి, పలువురు కోచ్‌లు, పిడిలు, క్రీడాకారులు పాల్గొన్నారు.



# బ్యాటరీ వాహనంలో ఏయూ పర్యవేక్షణ

**ఏయూ న్యూస్, అక్టోబర్ :** పర్యావరణ హిత వర్సిటీ ప్రాగణం కోసం అధికారులు మరో అడుగు వేశారు. వర్సిటీలో భవనాల పరిశీలనకు ఇటీవల బ్యాటరీ వాహనంలో వెళ్లారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ వాహనాన్ని స్వయంగా నడపగా, వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి, ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్, డీన్ డాక్టర్ జి.వీర్రాజు వెనక కూర్చోని పయనించారు. పలు ప్రాంతాలను పర్యవేక్షించారు. భవిష్యత్తులో వర్సిటీ వినియోగానికి మరిన్ని బ్యాటరీ వాహనాల అందుబాటులోకి తేనున్నారు.



Chief Patron Prof. P.V.G.D. Prasada Reddy, Chief Editor Prof K.Samatha, Publisher Prof V. Krishna Mohan, Chief Advisor Prof James Stephen, Technical Adviser D.Sivakumar Reddy, Editorial Team Dr. Challa Rama Krishna, Prof. D.Lalitha Bhaskari, Dr. T.Vijaya Lakshmi, Mr. V.V.S.V Narasimham, Dr. Ch. Satyanarayana, Andhra University South Campus, Visakhapatnam, Andhra Pradesh, India, Pin: 530 003, Phone : 0891-284422